


వాసవీ అమ్మవారి గ్రామోత్సవం

రెంటచింతల: వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి జన్మదిన వేడుకలలో భాగంగా బుధవారం రాత్రి అమ్మవారి ఉత్సవ విగ్రహంతో గ్రామోత్సవం నిర్వహించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 513.60 అడుగుల వద్ద ఉంది. ఇది 137.8642 టీఎంసీలకు సమానం.



వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన

మంగళగిరి: మండలంలోని రామచంద్రాపురంలో వేంచేసి ఉన్న వీరబ్రహ్మేంద్ర స్వామి వారి ఆరాధన ఉత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు.

న్యూస్‌రీల్

బంగారు తాపడం పనులకు రూ. లక్ష విరాళం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ ఆలయ బంగారు తాపడం పనులకు గుంటూరుకు చెందిన భక్తులు గురువారం రూ. లక్ష విరాళాన్ని అందజేశారు. గుంటూరుకు చెందిన బి. కోట్యానాయక్ కుటుంబం అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేసింది. ఆలయ అధికారులను కలిసి బంగారు తాపడం పనులకు రూ. 1,00,116 విరాళాన్ని అందజేసింది. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం దాతలకు ఆలయ అధికారులు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందించారు.

ప్రభుత్వ పరీక్షల విభాగం సైట్‌లో టెన్త్ షార్ట్ మెమోలు

గుంటూరు ఎడ్యుకేషన్: గత మార్చిలో జరిగిన పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరైన విద్యార్థులకు సంబంధించిన షార్ట్ మెమోలను ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో అన్ని యాజమాన్యాల్లోని ఉన్నత పాఠశాలల నుంచి టెన్త్ పరీక్షలు రాసిన విద్యార్థులకు సంబంధించిన మార్కుల మెమోలను ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు డౌన్‌లోడ్ చేసుకుని, వాటిపై సంతకంతో విద్యార్థులకు అందజేయాలని సూచించారు. మెమోల్లో ఏవైనా తప్పులు, పొరపాట్లు దొర్లితే అడ్మిషన్ రికార్డు ప్రకారం పరిశీలించి, అడ్మిషన్ రిజిస్టర్ కాపీ, మార్కుల మెమోను ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు ధ్రువీకరించుకుని, ఈనెల 25లోపు ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ కార్యాలయానికి పంపాలని సూచించారు.

తీరంలో ఇద్దరు యువతులు గల్లంతు

కాపాడిన పోలీసులు



బాపట్లటౌన్: స్నానాలు చేస్తూ ఇద్దరు యువతులు సముద్రంలో మునిగిపోయిన ఘటన గురువారం సూర్యలంక తీరంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన దుర్గేశ్‌దేవి, నీషాలు గుంటూరు జిల్లా ఏటుకూరు రోడ్ బైపాస్, హనుమాన్ టెంపుల్ సమీపంలోని బుల్లెట్ స్పిన్నింగ్ మిల్లులో నివాసముంటున్నారు. గురువారం కుటుంబ సభ్యులతో కలిసి సూర్యలంక బీచ్‌కి వచ్చారు. స్నానాలు చేస్తుండగా ఒక్కసారిగా వచ్చిన ఆలల తాకిడికి సముద్రంలో ఇద్దరు యువతులు గల్లంతయ్యారు. ఈ విషయాన్ని గమనించిన పోలీసులు వెంటనే అప్రమత్తమై ఇరువురిని కాపాడారు. ఇద్దరు ప్రాణాలు కాపాడిన కోస్టల్ సెక్యూరిటీ సీఐ లక్ష్మారెడ్డి, ఎస్ఐ నాగశివారెడ్డి, ఏఎస్ఐ అమరేశ్వరరావు, హెడ్‌కానిస్టేబుల్ గంగాధర్‌రావు, హోంగార్డు నారాయణలను ఎస్పీ తుషార్ డూడీ అభినందించారు.

దివ్యాంగులకు డీఎస్సీ క్రాష్ కోర్సులో ఉచిత శిక్షణ

నెహ్రూనగర్: గుంటూరు జిల్లాలోని దివ్యాంగ అభ్యర్థులకు విజయవాడలో డీఎస్సీ క్రాష్ కోర్స్‌పై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సువార్త గురువారం ఓ ప్రకటనలో తెలియజేశారు. ఎస్‌జీటీ టీచర్ పోస్టులకు అర్హత గల అభ్యర్థుల కోసం ఈ శిక్షణ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ నెల 11వ తేదీలోగా ఎంపీఎఫ్‌సీ.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కనీసం 40శాతం వికలాంగత్వం ఉన్నవారు అర్హులని తెలిపారు. టెట్ స్కోర్ ఆధారంగా ఎంపిక జరుగుతుందన్నారు.

ఈదురుగాలులు, భారీ వర్షం

మంచాల(చేబ్రోలు): చేబ్రోలు మండల పరిధిలోని గ్రామాల్లో గురువారం అకాల వర్షం కురిసింది. మండల పరిధిలోని మంచాల గ్రామంలో కురిసిన భారీ వర్షం, ఈదురుగాలులకు విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. చెట్ల కొమ్మలు విరిగిపోయాయి. మధ్యాహ్న సమయంలో వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు సంభవించి ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది.

ఇది ప్రజా స్వామ్యమా? నియంతృత్వమా?



మీడియా ఎడిటర్ ఇంటిపై దాడి దేశంలోనే ఇది ప్రథమం. ప్రజలకు వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకుంటే అడిగే హక్కు ఎవరికీ లేదా? ఇది ప్రజా స్వామ్యమా? నియంతృత్వమా? పది నెలల్లోనే రాజ్యాంగాన్ని తిరగరాసి రెడ్‌బుక్ అమలు చేస్తానంటే చూస్తూ ఊరుకోవాలా? ఇది సాక్షి ఎడిటర్ ఇంటిపై మాత్రమే జరిగిన దాడి కాదు.. ప్రజాస్వామ్యంపై జరిగిన దాడి.

- బి.వి.రాఘవరెడ్డి, ఏపీ నెట్‌వర్క్ ఇన్‌చార్జి, సాక్షి దినపత్రిక

సాక్షికి పోరాటాలు కొత్త కాదు



సాక్షికి పోరాటాలు కొత్త కాదు. ఎడిటర్ ఇంటిపై దాడిచేయడం తగదు. నచ్చని విషయాలు రాస్తే అణచివేయాలని చూస్తారా? రెండు నెలల క్రితం పుట్టిన సంస్థకు రూ.కోట్ల విలువైన భూముల ఇచ్చేసి, ఆ విషయాన్ని రాయొద్దంటే ఎలా? తప్పు చేస్తే ప్రెస్ కౌన్సిల్, న్యాయస్థానాలకు ఫిర్యాదు చేయాలి. ఇంటికి పోలీసులను పంపడం తగదు. ఎంత అణచివేయాలని చూస్తే, సాక్షి అంతగా పైకి లేస్తుంది.

- పి.శ్రీనివాస్, అసోసియేట్ ఎడిటర్, సాక్షి దినపత్రిక

పోలీసుల చొరబాటు హేయం



'సాక్షి' ఎడిటర్ ధనంజయరెడ్డి ఇంటిలోకి పోలీసుల చొరబాటు హేయమైన చర్య. అకారణంగా ఇంట్లోకి పోలీసులు చొరబడటం సబబు కాదు. గౌరవ ప్రదమైన వ్యక్తుల ఇళ్లకు వెళ్లేటప్పుడు సెర్చ్ వారెంటు తీసుకోవాలి. మరోసారి ఇలాంటివి జరక్కుండా ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలి.

- చిలుకా చంద్రశేఖర్, ఏపీ పౌరహక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి , సత్తెనపల్లి

కలమెత్తిన పాత్రికేయం

ఫోర్త్ ఎస్టేట్‌పై ఖాకీ క్రౌర్యం

అక్షరంపై అక్కసు వెళ్లగక్కుతున్న కూటమి సర్కార్‌పై పాత్రికేయలోకం మండిపడింది. పోలీసులను అడ్డం పెట్టుకుని పచ్చ సైన్యం దాడిపై కన్నెర్ర జేసింది. అక్రమ కేసులు పెడుతూ, ఖాకీలతో దాష్టికానికి పాల్పడుతున్న రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై పాత్రికేయులు నిప్పులు చెరిగారు. ప్రజాస్వామ్యానికి మూల స్తంభం అయిన ఫోర్త్ ఎస్టేట్‌పై దాడిని ఖండించారు. 'సాక్షి' ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డి నివాసంలో గురువారం ఉదయం పోలీసుల సోదాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం సెర్చ్ వారంట్ లేకుండా అక్రమంగా ఆయన నివాసంలోకి ప్రవేశించి వ్యవహరించిన తీరుపై నిరసన గళం విప్పారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ 'సాక్షి'గా కూటమి పాలకుల నిరంకుశ విధానాలకు ప్రజలు బుద్ధి చెప్పాలని కోరారు . నిజాల్ని నిర్భయంగా తెలిపే అక్షరానిదే అంతిమ విజయమని నినదించారు

- 'సాక్షి' ఎడిటర్ గృహంలో పోలీసుల అక్రమ సోదాలపై పెల్లుబికిన ఆగ్రహం
- నిరసించిన జర్నలిస్టులు, ప్రజా సంఘాలు
- 'సాక్షి' గొంతు నొక్కేందుకే ఈ చర్య అంటూ ఆందోళన
- కూటమి ప్రభుత్వ నియంత పోకడలపై మండిపాటు



గుంటూరు లాడ్జి సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న జర్నలిస్టులు

పట్నంబజారు: గుంటూరు లాడ్జి సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద 'సాక్షి' సిబ్బంది, పలు పత్రికల పాత్రికేయులు, సోషల్ మీడియా రిపోర్టర్లు, ప్రతినిధులు, యువత, విద్యార్థులు, జర్నలిస్టు యూనియన్ నేతలు నల్ల రిబ్బన్లు ధరించి నిరసన తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వ విధానాలు ఎండగట్టారు. 'సాక్షి' ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డి నివాసంలో పోలీసుల సోదాలను ఖండించారు. కూటమి ప్రభుత్వ నియంత పోకడలపై పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నిరసన కార్యక్రమానికి హాజరైన కార్పొరేటర్ ఈచంపాటి వెంకటకృష్ణ మాట్లాడుతూ పత్రికల గొంతు అణచివేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ఒంటెత్తు పోకడలతో ముందుకు సాగుతోందని ధ్వజమెత్తారు. ఫోర్త్ ఎస్టేట్‌గా పిలువబడే మీడియాకు సంకెళ్లు వేసే విధంగా చంద్రబాబు సర్కార్ కక్షసాధింపు ధోరణితో వ్యవహరిస్తోందని మండిపడ్డారు. నిజాలను నిగ్గుతేలుస్తూ రాష్ట్ర ప్రభుత్వ అసమర్థతను ఎత్తి చూపుతున్నారనే దుగ్ధతో ఇటువంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. న్యాయవాది మొండితోక శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎటువంటి సమాచారం లేకుండా నివాసాల్లోకి చొరబడి, తనిఖీ చేసే హక్కు పోలీసులకు ఎవరిచ్చారని ప్రశ్నించారు. కార్యక్రమంలో సాక్షి రిపోర్టర్లు పి.ఎస్.ఎన్.వి. ప్రశాంత్, వి.కిరణ్‌కుమార్, ధూపాటి ప్రకాష్, ఎం.శ్రీనివాసరావు, కె.శ్రీనివాసరావు, ఎం.సి.హెచ్. కోటిరెడ్డి, ఫొటోగ్రాఫర్ రామ్‌గోపాలరెడ్డి, ఎం.డి. సత్యనారాయణ, జి.వెంకటరెడ్డి, అబ్దుల్లా, పలు పత్రికల రిపోర్టర్లు కార్తిక్‌రెడ్డి, బాషా, వంశీ, ఎస్ఆర్‌కే సుభాని, వినయ్ పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు



గుంటూరు జిల్లా అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) జి.వి.రమణమూర్తికి వినతిపత్రం అందజేస్తున్న 'సాక్షి' ఎడిషన్ ఇన్‌చార్జి ఎం.తిరుమలరెడ్డి, ఏపీయూడబ్ల్యూజే నేతలు, జర్నలిస్టులు

గుంటూరు మెడికల్: సాక్షి ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డి నివాసంపై విజయవాడ నగర సెంట్రల్ పోలీసులు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా అక్రమంగా ప్రవేశించి సెర్చ్ చేయడాన్ని ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు (ఏపీయూడబ్ల్యూజే) నేతలు ఖండించారు. ఈ మేరకు గురువారం ఎస్పీ కార్యాలయంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) జి.వి. రమణమూర్తిని కలిసి వినతిపత్రం అందజేశారు. జర్నలిస్టు యూనియన్ అధ్యక్షుడు షేక్ నాగూల్‌మీరా మాట్లాడుతూ అవినీతి, అక్రమాలను వెలికి తీయడంతోపాటు, ప్రజా సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే ప్రక్రియలో భాగస్వాములవుతున్న పత్రికారంగంపై దాడి చేయడం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టుగా భావిస్తున్నామన్నారు. భవిష్యత్తులో మొత్తం మీడియాపై ఇవే దాడులు, ఇవే ఆంక్షలు, ఇలాంటి బెదిరింపులు కొనసాగే పరిస్థితి ఉందని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో నాల్గవ స్తంభం అయిన మీడియా పరిరక్షణకు పత్రికా స్వేచ్ఛకు రక్షణ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో 'సాక్షి' ఎడిషన్ ఇన్‌చార్జి ఎం.తిరుమలరెడ్డి, యూనియన్ జిల్లా సెక్రటరీ కె.రాంబాబు, నగర గౌరవ అధ్యక్షుడు సత్యనారాయణశర్మ, అధ్యక్షుడు వి.కిరణ్‌కుమార్, సబ్ ఎడిటర్లు దివి రఘు, పి.శ్రీనివాసరావు, ఎస్.వెంకట్, బి.సురేష్‌బాబు, జర్నలిస్టులు మొండితోక శ్రీనివాసరావు, షరీఫ్, వీరయ్య, సురేంద్ర, పి.ప్రశాంత్, డి.ప్రకాష్, ఎం.శ్రీనివాసరావు, కె.శ్రీనివాసరావు, ఎం.కోటిరెడ్డి, రామ్‌గోపాలరెడ్డి పాల్గొన్నారు.

దాడులు హేయమైన చర్య

'సాక్షి' దినపత్రిక సంపాదకుడు ఆర్. ధనంజయరెడ్డి ఇంటిలో పోలీసులు తనిఖీలు చేసిన తీరును ఖండిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (ఏపీయూడబ్ల్యూజే) జిల్లా అధ్యక్షుడు షేక్ నాగూల్‌మీరా, ప్రధాన కార్యదర్శి కె.రాంబాబులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలీసులు సోదాలు చేయాలని భావించి ఉంటే ముందుగా నోటీసు ఇచ్చి ఉండాలని సూచించారు. పెద్ద సంఖ్యలో పోలీసులు ఇంటిలో చొరబడిన తీరును ఖండించారు. ఇలాంటి ధోరణి భావ్యం కాదని తెలిపారు.

పత్రికా స్వేచ్ఛను పరిరక్షించాలి

తెనాలి: 'సాక్షి' దినపత్రిక సంపాదకుడు ఆర్.ధనంజయరెడ్డి ఇంటిపై పోలీసుల సోదాలపై సాక్షి మీడియా తెనాలి ప్రతినిధులు గురువారం నిరసన వ్యక్తం చేశారు. వహాబ్ రోడ్డులోని అజీమ్‌ఖాన్ వీధిలోని సాక్షి రీజనల్ సెంటర్ కార్యాలయం నుంచి సాయంత్రం ప్రదర్శనగా మండల తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడ తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విజయవాడలోని ఆంధ్ర లయోలా కాలేజీ దగ్గర్లోని వెటర్నరీ కాలనీలో 'సాక్షి' ఎడిటర్ ఆర్.ధనుంజయరెడ్డి నివాసం ఉంటున్న అపార్టుమెంటుకు నగర సెంట్రల్ ఏసీపీ దామోదర్, మాచవరం సీఐ ప్రకాష్‌లు సిబ్బందితో పాటు అక్రమంగా ప్రవేశించినట్టు తెలిపారు. సెర్చ్ వారంట్, ఎలాంటి నోటీసు లేకుండా వచ్చి భయానక వాతావరణం సృష్టించారని పేర్కొన్నారు. గౌరవప్రదమైన పత్రికా ఎడిటర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఆర్.ధనుంజయరెడ్డి వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగించటంతోపాటు సమాజంలో పరువు ప్రతిష్ఠలకు విఘాతం కలిగే రీతిలో పోలీసులు వ్యవహరించారని ధ్వజమెత్తారు. ఇది సాక్షి ఎడిటర్‌పై మాత్రమే జరిగిన దాడి కాదనీ, భవిష్యత్‌లో మొత్తం మీడియాపై ఇవే దాడులు, బెదిరింపులు కొనసాగే పరిస్థితి ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సాక్షి తెనాలి రీజనల్ సెంటర్ ఇన్‌చార్జి బి.ఎల్.నారాయణ, సాక్షి మీడియా విలేకరులు కేజే నవీన్, ఆలపాటి సుధీర్, తాడిబోయిన రామకృష్ణ, సాక్షి టీవీ ప్రతినిధి తోట శ్రీనివాసరావు, వేమూరు ఆర్‌సీ ఇన్‌చార్జి బుల్లయ్య, సర్క్యులేషన్ ఇన్‌చార్జి దాసు తదితరులు పాల్గొన్నారు. సంఘీభావంగా స్థానిక పత్రిక సంపాదకుడు అడపా సంపత్‌రాయుడు పాల్గొన్నారు.



తెనాలిలో మండల తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణకు వినతిపత్రం ఇస్తున్న సాక్షి మీడియా జర్నలిస్టులు

ఎడిటర్ ఇంటిపై దాడి హేయమైన చర్య



కలెక్టర్ కార్యాలయం పరిపాలనాధికారికి వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

బాపట్ల టౌన్: నిత్యం ప్రజా శ్రేయస్సు కోసం పాటుపడే పత్రికా సంస్థల ఎడిటర్ ఇళ్లపై ఎలాంటి సమాచారం లేకుండా, కనీసం నోటీసులు జారీ చేయకుండా దాడులు చేయడం హేయమైన చర్యని బాపట్ల వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ సహాయ కార్యదర్శి కాగిత ప్రశాంత్‌రాజు తెలిపారు. సాక్షి ఎడిటర్ ఆర్. ధనంజయరెడ్డి అపార్టుమెంట్‌లోకి పోలీసులు వెళ్లి తనిఖీల పేరుతో భయభ్రాంతులకు గురిచేసేలా ప్రవర్తించిన తీరుకు నిరసనగా గురువారం సాయంత్రం బాపట్లలోని జర్నలిస్ట్ సంఘాల ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టర్ కార్యాలయం పరిపాలనాధికారి సీతారత్నానికి వినతిపత్రం అందజేశారు. ప్రశాంత్‌రాజు మాట్లాడుతూ కనీసం సెర్చ్ వారెంట్ అడిగినా చూపకుండా దురుసుగా ప్రవర్తించడం పత్రికా స్వేచ్ఛను హరించడమే అవుతుందని తెలిపారు. పత్రికా ఎడిటర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఆర్. ధనంజయరెడ్డి వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగించడంతో పాటు, సమాజంలో పరువు ప్రతిష్ఠలకు విఘాతం కలిగే రీతిలో వ్యవహరించడం సరికాదని పేర్కొన్నారు. అవినీతి, అక్రమాలను వెలికితీయడంతోపాటు, ప్రజా సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే ప్రక్రియలో భాగస్వాములవుతున్న పత్రికా రంగంపై దాడి చేయడం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు అని తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో బాపట్ల జర్నలిస్ట్ సంఘాల నాయకులు వేజెండ్ల శ్రీనివాసరావు, మురికిపూడి అంజయ్య, అంగిరేకుల కోటేశ్వరరావు, రాఘవేంద్రరావు, పరిశా వెంకట్, సృజన్ పాల్, శీలం సాగర్, మార్పు ఆనంద్, అడే రవిజేత, జె. రవిరాజేష్ పాల్గొన్నారు.

కలంపై కత్తి కట్టారు

నరసరావుపేట: పత్రికా స్వేచ్ఛకు, ప్రతినిధులకు కూటమి ప్రభుత్వంలో రక్షణ లేకుండా పోవటం దురదృష్టకరమని జర్నలిస్టులు, ప్రజాసంఘాలు, కులసంఘాల నాయకులు పేర్కొన్నారు. సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనంజయరెడ్డి ఇంటిపై సెర్చ్ వారెంట్ లేకుండా పోలీసులు చేసిన అక్రమ సోదాలను నిరసిస్తూ గురువారం సాయంత్రం పల్నాడు జిల్లా ప్రెస్ క్లబ్, నరసరావుపేట, ఏపీ వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్(ఏపీడబ్ల్యూజే), ఏపీ యూ ట్యూబ్ న్యూస్ చానల్స్ ఆఫ్ జర్నలిస్టు అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కార్యాలయంలో డెప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

వారెంట్ లేకుండా ఎలా వెళతారు?

పల్నాడు జిల్లా ప్రెస్‌క్లబ్, నరసరావుపేట అధ్యక్షుడు సీహెచ్‌వీ రమణారెడ్డి, ఏపీడబ్ల్యూజే జిల్లా గౌరవాధ్యక్షులు ఎస్.జగన్మోహన్‌రెడ్డి, దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం(పీడీఎం) రాష్ట్ర నాయకుడు వై.వెంకటేశ్వరరావు, కులనిర్మూలన పోరాట సమితి (కేఎన్‌పీఎస్) రాష్ట్ర కార్యదర్శి కేఎస్ కృష్ణ మాట్లాడారు. ప్రజాస్వామ్య వ్యవస్థకు నాలుగో స్తంభమైన మీడియా రంగంపై ప్రభుత్వాల దాడులను ప్రజాస్వామ్యవాదులు ఖండించాలని కోరారు. కార్యక్రమంలో సాక్షి దినపత్రిక పల్నాడు జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఆర్.లవకుమార్‌రెడ్డి, సాక్షి టీవీ జిల్లా రిపోర్టర్ అశోక్, నరసరావుపేట ప్రతినిధి సుంకిరెడ్డి, జర్నలిస్టులు జి.సాంబశివారెడ్డి, పి.కోటిరెడ్డి, పాదర్తి ప్రసాదు, యూట్యూబర్ అసోసియేషన్ జిలా అధ్యక్షుడు షేక్ షాహిద్, పీడీఎం రాష్ట్ర నాయకుడు నల్లపాటి రామారావు, పీకేఎస్ నాయకుడు కంబాల ఏడుకొండలు, డీబీహెచ్ నాయకుడు గోదా రమేష్‌కుమార్ పాల్గొన్నారు.



నరసరావుపేట ఆర్డీఓ కార్యాలయం వద్ద ప్రదర్శన చేస్తున్న జర్నలిస్టులు, ప్రజా, కులసంఘాల నాయకులు

కల్యాణోత్సవాలకు వేళాయె

- నేటి నుంచి పల్నాటి యాదాద్రి ఉత్సవాలు
- మూడురోజుల పాటు ఉత్సవాలకు సర్వం సిద్ధం

గురజాల: పల్నాడు యాదాద్రిగా పేరుగాంచిన శ్రీ లక్ష్మీ నరసింహస్వామి కల్యాణోత్సవాలకు సర్వం సిద్ధమైంది. కోరిన కోర్కెలు తీర్చే కలియుగ దైవంగా పల్నాటి వాసుల ఆరాధ్య దైవంగా పేరుగాంచిన యాదాద్రి ఉత్సవాలు శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తిచేశారు.

'అంకురార్పణ'తో ప్రారంభం

పల్నాడు యాదాద్రి శ్రీ భూ సమేత నరసింహస్వామి వారి బ్రహ్మోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. మొదటి రోజు శుక్రవారం సాయంత్రం అంకురార్పణ కార్యక్రమంతో ప్రారంభమై నరసింహ యాగం, ధ్వజారోహణం, తీర్థ ప్రసాద ఘోష్టి, రెండవ రోజు శనివారం కనులపండువగా కల్యాణోత్సవం, అన్న సంతర్పణ, కోలాటం, పలు సాంస్కృతిక కార్యక్రమాలు, సహస్ర దీపాలంకరణ సేవ, మూడవ రోజు ఆదివారం నరసింహ యాగం, పూర్ణాహుతి, చక్రస్నానం, ద్వాదశ ప్రదక్షిణాలు, తీర్థ ప్రసాద ఘోష్టి, కాగడ సేవలతో విద్యుత్ దీపాలంకరణతో గ్రామోత్సవం నిర్వహించడం జరుగుతుంది.

పలు అభివృద్ధి పనులు

దేవాలయం ప్రాంగణంలో నూతనంగా నిర్మాణం చేసిన వాహనశాల, ఆఫీసు రూం, ప్రతి శనివారం అన్నదానం నిర్వహించేందుకు అన్నదాన హాల్‌తో పాటు పలు భవనాల ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేశారు. కల్యాణోత్సవాలకు దేవాలయాన్ని దేవదాయ కమిటీ సభ్యులు ముస్తాబు చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో పలు చర్యలు చేపడుతున్నారు.



స్వామివారి విగ్రహం

కచ్చితమైన ఆధారాలతో శిక్షలు

జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు

నరసరావుపేట: క్షేత్రస్థాయిలో ఆధారాల సేకరణలో కచ్చితత్వం పాటిస్తే ముద్దాయిలకు శిక్షలు పడే విధంగా చేయవచ్చని జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు పేర్కొన్నారు. గురువారం జిల్లా కలెక్టరేట్‌లోని గుర్రం జాషువా కాన్ఫరెన్స్ హాలులో జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో పోలీస్ అధికారులకు 'ఫోరెన్సిక్ ఎవిడెన్స్ మేనేజ్‌మెంట్' అంశంపై నిర్వహించిన వర్క్‌షాపులో జిల్లా ఎస్పీ మాట్లాడారు. నిపుణులు అందించిన మెలకువలను క్షేత్రస్థాయిలో ఉపయోగించి కేసుల్లో ముద్దాయిలకు శిక్షలు పడే విధంగా సమగ్ర దర్యాప్తు చేపట్టాలని ఎస్పీ సూచించారు. ఫోరెన్సిక్ నిపుణులు డి.కాంచన, ఎల్.స్వాతి, కె.సురేంద్రబాబు, ఫోరెన్సిక్ అసిస్టెంట్ డైరక్టర్లు బి.రామకృష్ణారావులు దర్యాప్తు ప్రక్రియకు ఉపకరించే అనేక మెలకువలను పోలీస్ అధికారులకు వివరించారు. జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు. అనంతరం ఫోరెన్సిక్ సైంటిఫిక్ అధికారులకు ఎస్పీ శాలువా కప్పి మెమొంటోలతో సత్కరించారు.



ఫోరెన్సిక్ నిపుణుడిని సన్మానిస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

క్లుప్తంగా

అసిస్టెంట్ ఏఎంఓ పోస్ట్‌కు దరఖాస్తు చేసుకోండి

నరసరావుపేట ఈస్ట్: సమగ్ర శిక్ష పల్నాడు జిల్లా కార్యాలయంలో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ (ఉర్దూ) పోస్ట్‌కు అర్హులైన ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యా శాఖాధికారి ఎల్.చంద్రకళ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఎస్‌జీటీలు ఈనెల 7వ తేది నుంచి 26వ తేదీ సాయంత్రం 5గంటలలోపు అధికారుల ద్వారా ధ్రువీకరించిన తమ దరఖాస్తులను డీఈఓ, సమగ్ర శిక్ష కార్యాలయంలో అందజేయాలని స్పష్టం చేశారు. ఆసక్తి గల ఉపాధ్యాయులు ఇతర వివరాలకు జీసీడీఓ డి.రేవతి (9440642122), ఏఎల్ఎస్‌సీ కోఆర్డినేటర్ కె.శ్రీనివాసరావు (8074499649)లకు సంప్రదించాలని తెలిపారు.

ఐఎల్‌ఏ అధ్యక్షుడిగా బాబురావు



చావా బాబురావు



పాటిబండ్ల రవి

సత్తెనపల్లి: ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ (ఐఎల్ఏ) అధ్యక్షుడిగా సత్తెనపల్లికి చెందిన న్యాయవాది చావా బాబురావు, నియమితులయ్యారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో అసోసియేషన్ సత్తెనపల్లి యూనిట్ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు జి.శాంత కుమార్ ఆయనను నియమించారు. అలాగే కార్యదర్శిగా పాటిబండ్ల రవిని నియమించారు. ఈ సందర్భంగా బాబురావు, రవిలు మాట్లాడుతూ ప్రజా సమస్యలపై తమ వంతుగా పాటుపడుతూ వాటి పరిష్కారం దిశగా పని చేస్తామన్నారు. నూతనంగా నియమితులైన వారికి రాష్ట్రకార్యవర్గ సభ్యులు ఊర్ల విష్ణు కుమార్, ఎ.బ్రహ్మేశ్వరరావు, పల్నాడు జిల్లా అధ్యక్షుడు దాసరి జ్ఞానరాజ్‌పాల్, జిల్లా కార్యదర్శి బొక్కా సంగీతరావు, ఉటికూరి పాపారావు, తలతోటి ఆనంద శ్రీనివాసరావు, జొన్నలగడ్డ విజయ్ కుమార్, సూరె వీరయ్య, మామిడి ప్రకాష్, తదితరులు అభినందనలు తెలిపారు.

కుమారుడి దాడితో తండ్రి మృతి!



చిలకలూరిపేటటౌన్: అనుమానస్పద రీతిలో వృద్ధుడు మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మురికిపూడి గ్రామానికి చెందిన తాపీ మేస్త్రీ చంబేటి రామకృష్ణ భార్య బుధవారం చిలకలూరిపేట పట్టణంలోని ఓ ఆస్పత్రిలో కుమార్తెకు జన్మనిచ్చింది. ఈ విషయం తెలిసి ఆస్పత్రికి ఎందుకు రాలేదంటూ తండ్రి చంబేటి శ్రీనివాసరావు(43) రామకృష్ణను ప్రశ్నించాడు. ఇద్దరి మధ్య వాగ్వాదం జరగ్గా, మద్యం మత్తులో ఆవేశంగా తండ్రి కాళ్లపై కర్రతో రామకృష్ణ దాడి చేశాడు. అసలే ఐదేళ్లుగా సోరియాసిస్ వ్యాధితో బాధపడుతున్న శ్రీనివాసరావు తీవ్రంగా గాయపడి గురువారం ఉదయం మృతి చెందాడు. దీంతో మృతుడు శ్రీనివాసరావు తల్లి లక్ష్మి తన కుమారుడు.. మనవడి దాడి కారణంగానే మృతి చెందాడా, లేక మరేదైనా కారణమా కనుగొనాలని పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో అనుమానాస్పద మృతిగా రూరల్ ఎస్ఐ జి.అనిల్‌కుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. శ్రీను మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

భౌ పెడుతున్నాయి!

- జిల్లాలో పెరిగిన వీధికుక్కల కాటు కేసులు
- నీళ్లు, ఆహారం లభించక వాటి ప్రవర్తనలో మార్పులు
- పిచ్చిపట్టి దాడులకు సైతం పాల్పడుతున్న వైనం
- తాజాగా కమ్మవారిపాలెం ఎస్టీ కాలనీలో ముగ్గురిపై దాడి
- వీధికుక్కల నియంత్రణను గాలికి వదిలేసిన పాలకులు, అధికారులు



సత్తెనపల్లి ప్రధాన రహదారిలో వీధి కుక్కలు

సత్తెనపల్లి: జిల్లాలో వీధికుక్కల సంచారంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. రోజు రోజుకీ సంతతి పెరిగిపోతుంది. వీధుల్లో గుంపులుగా తిరుగుతూ జనంపై దాడి చేస్తున్నాయి. చిన్నారులకు ప్రాణ భయం నెలకొంది. ప్రస్తుతం వేసవిలో వీధి కుక్కలు చెలరేగి పోతున్నాయి. నీళ్లు, ఆహారం లభించకపోవడం, వడదెబ్బకు గురవుతుండడంతో పిచ్చి పిచ్చిగా వ్యవహరిస్తూ జనాలపై దాడులకు పాల్పడుతున్నాయి. ఇటీవల నూజెండ్ల మండలం కమ్మవారిపాలెం ఎస్టీ కాలనీలో ఆరు బయట నిద్రిస్తున్న ముగ్గురిపై పిచ్చికుక్క దాడి చేసింది.

జిల్లాలో 14వేలకు పైనే వీధి కుక్కలు

పల్నాడు జిల్లాలో పెంపుడు కుక్కలు సుమారు 1200 ఉండగా వీధి కుక్కలు 5244 వరకు ఉన్నట్లు పశుసంవర్ధక శాఖ అధికారులు చెబుతున్నారు. కానీ జిల్లావ్యాప్తంగా సుమారు 14 వేలకు పైనే ఉంటాయనేది అంచనా. వీధి కుక్కలను నియంత్రించాల్సిన బాధ్యత అర్బన్ ప్రాంతాల్లో మున్సిపాలిటీలు, గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీలు చేపట్టాలి. వీధి కుక్కల సంతతిని తగ్గించేందుకు కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు పెద్ద ఎత్తున చేపట్టాలి. జిల్లాలో ఎక్కడా వీధి కుక్కల నియంత్రణ గురించి పట్టించుకునే వారే లేరు. కుటుంబ నియంత్రణ వల్ల వీధి కుక్కల సంఖ్య తగ్గుతుంది. 75 శాతం వీధి కుక్కలకు రేబిస్ టీకాలు వేయడం వల్ల ఆ ప్రాంతాన్ని రేబిస్ రహితంగా మార్చవచ్చు.

కుక్క కరిస్తే..

కుక్క కరిచినచోట కుళాయి లేదా చెంబుతో నీటి ధార పోస్తూ సబ్బుతో పది నిమిషాలు కడగాలి. లైఫ్ బాయ్ సబ్బు అయితే మరీమంచిది. డెటాల్ లేదా గడ్డం గీసుకున్న తర్వాత వాడే లోషన్ పూయాలి. వీలైనంత త్వరగా వైద్యుడిని సంప్రదించాలి. పిచ్చి కుక్క అయితే మాత్రం వెంటనే రేబిస్ టీకాలు వేయించాలి. అయితే గాయాన్ని రుద్ది కడగరాదు. గాయంపై టింక్చర్ అయోడిన్ వేయకూడదు. గాయానికి కుట్లు వేయడం, గట్టిగా నొక్కడం చేయరాదు.

పెంపుడు కుక్కలను ఎండలో ఉంచకూడదు

ప్రస్తుతం పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లోనూ పెంపుడు కుక్కల పెంపకం ఎక్కువగా ఉంటోంది. ప్రధానంగా ఇంటికి రక్షణ కోసం మేలు జాతి కుక్కలను పోషిస్తున్నారు. కొంతమందికి కుక్కల పెంపకం హాబీగా మారింది. పెంపుడు కుక్కలు వేసవిలో వేడిని తట్టుకోలేవు. వేడిని భరించలేక దాడులకు పాల్పడే ప్రమాదం ఉంది. పెంపుడు కుక్కలు ఎక్కువసేపు ఎండలో ఉండకుండా జాగ్రత్త పడాలి. చల్లని నీరు అందుబాటులో ఉంచాలి.

ఇలా తప్పించుకోవచ్చు

- కుక్క దగ్గరికి వస్తే ఏ మాత్రం కదలకుండా నిలబడి ఉండటం ఉత్తమం. అవి దగ్గర ఉన్నప్పుడు ఎట్టి పరిస్థితుల్లోనూ పరిగెత్త కూడదు. వాటి కళ్లల్లోకి తదేకంగా చూడ కూడదు. వాటి పిల్లల దగ్గరికి వెళ్లరాదు. తల్లి కుక్క దాడి చేసే ప్రమాదం ఉంది.
- నిద్రిస్తున్నప్పుడు, తింటున్నప్పుడు, పిల్లలకు పాలిస్తున్నప్పుడు వాటిని కర్రలు, రాళ్లతో అదిలించడం గాని, ఏ రకంగా నైనా ఇబ్బంది పెట్టడం చేయకూడదు.
- కుక్క దాడి చేస్తే ముఖాన్ని పంచె, తువ్వాలు మొదలగు వాటితో కప్పుకోవాలి. అవేమీ లేకపోతే చొక్కాను పైకి జరుపుకోవాలి. లేదా ముఖాన్ని చేతులతో కప్పుకోవాలి. ఎందుకంటే ముఖంపై కరిస్తే ఇన్ఫెక్షన్ మెదడుకు త్వరగా సోకుతుంది.
- కుక్క కోపంగా దగ్గరకు వస్తే నేల వైపు చూస్తూ కుక్కకు దూరంగా మెల్లగా నడవాలి.

సైనిక స్కూల్‌గా శ్రీరామా రూరల్ హైస్కూల్

- భారత ప్రభుత్వ రక్షణ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలోని సైనిక్ స్కూల్స్ సొసైటీ అనుమతి
- వెల్లడించిన శ్రీరామా అకాడమీ అధ్యక్షుడు తులసీ విష్ణుప్రసాద్



తెనాలి: తెనాలి సమీపంలోని కొల్లూరు మండలం చిలుమూరులో గల శ్రీరామా రూరల్ హైస్కూలు ఇప్పుడు సైనిక్ స్కూలుగా రూపుదిద్దుకుంది. భారత ప్రభుత్వ రక్షణ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలోని సైనిక్ స్కూల్స్ సొసైటీ నుంచి అనుమతులు లభించాయి. హైస్కూలు ప్రాంగణంలో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో శ్రీరామా రూరల్ అకాడమీ అధ్యక్షుడు కొలసాని తులసీ విష్ణుప్రసాద్ వివరాలను వెల్లడించారు. 2025-26 విద్యాసంవత్సరం నుంచి సైనిక్ స్కూల్ కార్యకలాపాలు ప్రారంభిస్తున్నట్టు వెల్లడించారు. భారతదేశంలో మొత్తం 33 సైనిక్ స్కూల్స్ పనిచేస్తుండగా, మన రాష్ట్రంలో కోరుకొండ, కలిగిరిలో నడుస్తున్నాయని గుర్తుచేశారు. వీటితోపాటు ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో తొలి దశలో 42 సైనిక్ స్కూల్స్‌కు, ఇప్పుడు మరో 33 సైనిక్ స్కూల్స్‌కు భారత రక్షణ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలోని సైనిక్ స్కూల్స్ సొసైటీ అనుమతినివ్వగా, అందులో గుంటూరు జిల్లా నుంచి 76 ఏళ్లగా నడుస్తున్న శ్రీరామా రూరల్ హైస్కూలు ఒకటి కావటం గర్వకారణమన్నారు. కృష్ణానది ఒడ్డున దారీతెన్నూ లేని గ్రామీణ ప్రాంతంలో అప్పట్లో గురుకులంగా ఏర్పాటైన తమ పాఠశాల ఏటికేడాది ప్రగతి బాటన పయనిస్తూ ఈ స్థాయికి చేరిందన్నారు. అందుబాటులోకి వస్తున్న సాంకేతికతను అందిపుచ్చుకుంటూ 1987లో కంప్యూటర్ లాబ్, 2020 నుంచి సీబీఎస్ఈ, అటల్ టింకరింగ్ ల్యాబ్‌తో రోబోట్రిక్స్, డ్రోన్స్, త్రీడీ ప్రింటింగ్, స్కాచ్ కోడింగ్‌లో విద్యార్థులకు శిక్షణనిస్తున్నామని గుర్తుచేశారు. ఈ ఏడాది నుంచి కృత్రిమ మేధలోనూ తరగతులు ఉంటాయన్నారు. మరోవైపు విద్యార్థులు పరిపూర్ణ వికాసానికి ఎన్‌సీసీ, క్రీడలకు తగిన ప్రాధాన్యతనిస్తూ జాతీయ స్థాయిలో క్రీడాకారులను తీర్చిదిద్దుతున్నట్టు చెప్పారు. శ్రీరామా రూరల్ హైస్కూల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.శ్రీకాంత్ మాట్లాడుతూ ఉత్తమ విద్యతోపాటు దేశానికి అవసరమైన భావిభారత పౌరులను తీర్చిదిద్దే దిశగా తమ సైనిక్‌స్కూల్ పనిచేస్తుందని చెప్పారు.

ఉత్సాహంగా రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలు



ఇంకొల్లు (చినగంజాం): మండలంలోని పావులూరు గ్రామంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న గాదె వీరారెడ్డి మెమోరియల్ టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ గురువారం పోటాపోటీగా జరిగాయి. పావులూరు రెడ్డి యూత్ నిర్ణీత 10 ఓవర్లలో 83 పరుగులు చేయగా బీసీ యూత్ ఐదు ఓవర్లలో 84 పరుగులు చేసి 8 వికెట్ల తేడాతో విజయం సాధించారు. రెండో మ్యాచ్ పావులూరు వెంకటేష్ ఫ్రెండ్స్, దగ్గుబాడు ఫ్రెండ్స్ యూత్ జట్ల మధ్య నిర్వహించగా పావులూరు వెంకటేష్ ఫ్రెండ్స్ జట్టు విజయం సాధించింది. బాపట్ల జిల్లా వైఎస్సార్ సీపీ అధికార ప్రతినిధి బండారు ప్రభాకరరావు, కార్యదర్శి పులఖండం రామకృష్ణా రెడ్డి, తలకాయల కోటి శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు.. ఇద్దరికి తీవ్రగాయాలు



ఘటనాస్థలి వద్ద పడి ఉన్న బైక్

బల్లికురవ: వేగంగా వస్తున్న కారు.. బైక్‌ను ఢీకొట్టడంతో ఇరువురు యువకులు తీవ్రగాయాల పాలయ్యారు. ఈ ఘటన గురువారం నార్కెట్‌పల్లి-మేదరమెట్ల నామ్ రహదారిపై మండలంలోని వి.కొప్పరపాడు శివాలయం సమీపంలో జరిగింది. అందిన సమాచారం ప్రకారం.. అద్దంకి మండలం ధర్మవరం గ్రామానికి చెందిన అయ్యప్ప, వీరగంగయ్య పని నిమిత్తం బల్లికురవ మండలంలోని సూరేపల్లి వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం సంభవించింది. స్థానికులు 108కి సమాచారం ఇవ్వడంతో తీవ్ర గాయాలపాలైన ఇరువురికి ప్రాథమిక చికిత్స చేసిన అనంతరం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. స్థానికులు కారును అదుపులోకి తీసుకున్నారు.

హత్య కేసులో వ్యక్తికి జీవిత ఖైదు

నరసరావుపేటటౌన్: సిమెంట్ ఇటుకరాయితో తలపై మోది ఓ వ్యక్తిని దారుణంగా హతమార్చినట్లు నేరం రుజువవడంతో నిందితుడు పట్టణంలోని శివ సంజీవ కాలనీకి చెందిన తన్నీరు అంకమ్మరావు ఎలియాస్ ముళ్ల పందికి జీవిత ఖైదు, రూ.15వేల జరిమానా విధిస్తూ స్థానిక 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎస్.సత్య శ్రీ గురువారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం వివరాలు ఈ విధంగా ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రంలోని మహబూబ్‌నగర్ జిల్లా, కె.సముద్రం మండలం, నారాయణపురం గ్రామానికి చెందిన కరివేదుల సంపత్ రెడ్డి (45) 2023 మే 9వ తేదీన నరసరావుపేటకు వచ్చి రైల్వేస్టేషన్ రోడ్ లోని గాంధీపార్క్ వద్దగల విజయ్ దుర్గ కన్సల్టెన్సీ షాప్ ఎదురు రాత్రి సమయంలో నిద్రించాడు. తెల్లవారేసరికి తలకు తీవ్ర గాయాలతో మృతి చెంది ఉన్నాడు. సమాచారం అందుకున్న మొదటి పట్టణ పోలీసులు మృతుని చొక్కా జేబులో ఉన్న వివరాలను బట్టి అతని తండ్రి కరివేదుల నరసింహారెడ్డికి సమాచారం అందించారు. నరసింహారెడ్డి అతని బంధువులతో పట్టణానికి వచ్చి మృతుడు తన కుమారుడు సంపత్ రెడ్డి అని గుర్తుపట్టాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని మొదటి పట్టణ పోలీసులు సాంకేతిక పరిజ్ఞానంతో కేసును ఛేదించారు. సీసీ ఫుటేజ్ ఆధారంగా నిందితుడు పాత నేరస్తుడు తన్నీరు అంకమ్మరావు ఎలియాస్ ముళ్లపందిగా నిర్ధారించుకున్నారు. ఘటన జరిగిన విజయ్ దుర్గా కన్సల్టెన్సీ షాప్‌కు సీసీ కెమెరా ఫుటేజ్‌ను పరిశీలించగా 2023 మే 9వ తేదీ రాత్రి 2 నుంచి 2.30 గంటల మధ్య విజయ్ దుర్గా కన్సల్టెన్సీ షాపు షట్టర్ ఎదురు నిద్రిస్తున్న కరివేదుల సంపత్ రెడ్డిని నిందితుడు అంకంరావు ప్లాస్టిక్ సంచితో వచ్చి దాంట్లోని సిమెంట్ ఇటుకతో ముఖంపై కొట్టి షర్టు, ప్యాంట్ జేబులో ఉన్న నగదును తీసుకువెళ్లినట్లు స్పష్టంగా నిర్ధారించుకున్నారు. ఈ మేరకు నిందితుడు అంకమ్మరావును అరెస్టు చేసి కోర్టులో అభియోగ పత్రం దాఖలు చేశారు. విచారణలో నేరం రుజువు అవడంతో పై విధంగా కోర్ట్ తీర్పు వెలువడింది. ఏపీపీ దేశిరెడ్డి మల్లారెడ్డి ప్రాసిక్యూషన్ నిర్వహించగా అప్పటి నరసరావుపేట మొదటి పట్టణ సీఐ ఆకుల అశోక్ కుమార్ కేసును దర్యాప్తు చేసి కోర్టులో అభియోగ పత్రం దాఖలు చేశారు.

చిరస్మరణీయుడు డాక్టర్ పట్టాభి

ఇండియన్ బ్యాంక్ రీజియన్ హెడ్ ఎస్. జవహర్



పట్టాభి సీతారామయ్య విగ్రహానికి పూలమాల వేస్తున్న యూబీఐ రీజినల్ హెడ్ ఎస్.జవహర్

కొరిటెపాడు(గుంటూరు): స్వాతంత్ర సమరయోధునిగా, గాంధీజీ అనుంగు శిష్యుడిగా, స్వాతంత్ర్యానికి పూర్వమే ఆంధ్రాబ్యాంక్‌తో పాటు అనేక ఆర్థిక, బీమా సంస్థలను స్థాపించి తెలుగువారి కీర్తిని దశ దిశలా చాటిన డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్య బ్యాంకు ఉద్యోగులతో పాటు తెలుగు వారందరికీ చిరస్మరణీయులని యూనియన్ బ్యాంక్ రీజియన్ హెడ్ సయ్యద్ జవహర్ పేర్కొన్నారు. ఆంధ్రా బ్యాంక్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ గుంటూరు, నరసరావుపేట రీజియన్ ఆధ్వర్యంలో స్థానిక హిందూ కాలేజీ యూనియన్ బ్యాంక్ బ్రాంచి వద్ద ఏర్పాటు చేసిన పట్టాభి కాంస్య విగ్రహాన్ని గురువారం రీజియన్ హెడ్ జవహర్‌తో పాటు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూనియన్ బ్యాంక్ విశ్రాంత అధికారులు, యూనియన్ నాయకులు ప్రారంభించారు. విగ్రహానికి పూలమాల వేసి డాక్టర్ భోగరాజు అమర్ రహే.. లాంగ్ లివ్ అంటూ నినాదాలు చేశారు. అనంతరం స్థానిక రెవెన్యూ కల్యాణ మండపంలో జరిగిన సమావేశంలో జవహర్ మాట్లాడారు. డాక్టర్ భోగరాజు స్ఫూర్తితో రిటైరీస్, మహిళలు, విద్యార్థుల కోసం కొత్త పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్నామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ చైర్మన్ ఎ.రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ సీతారామయ్య స్థాపించిన ఆంధ్రా బ్యాంక్ రోల్ మోడల్‌గా నిలిచిందన్నారు. ప్రోగ్రాం కమిటీ చైర్మన్ కె. హరిబాబు మాట్లాడుతూ అసోసియేషన్ రిటైరీస్ సమస్యల పరిష్కారంతోపాటు వారి సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తోందని తెలిపారు. ఆల్ ఇండియా బ్యాంక్ రిటైరీస్ ఫెడరేషన్ ఆర్గనైజేషన్ సెక్రటరీ కృష్ణమూర్తి వి. వారణాసి మాట్లాడుతూ పారిశ్రామిక, రాజకీయ ఉద్దండులు ముళ్లపూడి హరిశ్చంద్రప్రసాద్, రాజగోపాల్ నాయుడు వంటి వారు పారిశ్రామికవేత్తలగా ఎదిగేందుకు సీతారామయ్య సహకరించారని తెలిపారు. దేశవ్యాప్తంగా 11,500 మంది విశ్రాంత ఆంధ్రా బ్యాంక్ ఉద్యోగులు కుటుంబాల కంటే సమాజ, దేశ సేవకు తొలి ప్రాధాన్యతనిస్తారని వివరించారు. ఈ సందర్భంగా వెలువరించిన ప్రత్యేక సంచికను అతిథులు ఆవిష్కరించారు. యూనియన్ బ్యాంక్ మాజీ చైర్మన్ పి.శ్రీనివాస్, విజయ బ్యాంక్ బ్యాంక్ మాజీ చైర్మన్ బి.ఎస్. రామారావు, ఆంధ్రప్రదేశ్ బ్యాంక్ రిటైరీస్ ఫెడరేషన్ అధ్యక్షులు బీబీవీ కొండలరావు, ప్రధాన కార్యదర్శి ఎ.ఎల్లారావు తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో ఏబీఆర్ఈఏ వైస్ ప్రెసిడెంట్ ఎస్.గణేష్, డిప్యూటీ జనరల్ సెక్రటరీ వై.కోటేశ్వరరావు, అసిస్టెంట్ జనరల్ సెక్రెటరీ వై.హనుమంతరావు, నిరంజన్ కుమార్, సుబ్బారావు, శివాజీ, ప్రసన్నత బాబు, కార్యవర్గ సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు గొర్రెల కాపరి మృతి

ఎనిమిది గొర్రెలు సైతం మృత్యువాత



చెట్టుకింద విగతజీవులుగా పడిఉన్న కాపరి అంకమ్మ, గొర్రెలు

చిలకలూరిపేటటౌన్/యడ్లపాడు: చిలకలూరిపేట మండలం కుక్కవారిపాలెం గ్రామం పంట పొలాల్లో పిడుగుపాటుకు గొర్రెలతో పాటు వాటిని కాసేందుకు వెళ్లిన రైతు మృత్యువాత పడిన సంఘటన బుధవారం రాత్రి జరిగింది. పెదనందిపాడు మండలం ఉప్పలపాడు శివారు జరుగులవారిపాలెం గ్రామానికి చెందిన ఒంటిపులి అంకమ్మ(84) తన జీవనాధారమైన గొర్రెలను ఉదయాన్నే తీసుకొని కుక్కవారిపాలెం సమీపంలోని పంట పొలాలకు వెళ్లాడు. సాయంత్రం సమయంలో అకస్మాత్తుగా ఆకాశంలో మేఘాలు కమ్ముకొని ఉరుములు, మెరుపులతో వర్షం ప్రారంభమైంది. వర్షం తట్టుకోలేక అంకమ్మ తన గొర్రెలను సమీపంలోని జమ్మిచెట్టు కిందకు నడిపించాడు. అయితే క్షణాల్లోనే ఆ చెట్టుపై పిడుగు పడడంతో అంకమ్మ అక్కడికక్కడే మృతి చెందాడు. అతనితో పాటు ఉన్న 8 గొర్రెలు కూడా ప్రాణాలు కోల్పోయాయి. మృతుడికి భార్య సామ్రాజ్యం, ఇద్దరు కుమారులు ఉన్నారు.